



www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

మంగళవారం | 21 | జూలై | 2026 | పేజీలు: 08








## నూనెల ఉత్పత్తిలో

# స్వయం సమృద్ధి

## ఆయిల్ ఫాం హబ్‌గా తెలంగాణ

వ్యవసాయానికి పరిశ్రమల తోడ్పాటుతోనే రైతుల ఆదాయం పెరుగుతుంది

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ఖమ్మంలో మరిన్ని అగ్రో ఆధారిత పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం

విలువ ఆధారిత వ్యవసాయంతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి

సీడ్ గార్డెన్‌తో దేశానికే ఖమ్మం కేంద్రంగా మారుతుంది

గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన డిప్యూటీ సీఎం



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్మించిన గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు రాష్ట్ర వ్యవసాయ ..మిగతా 2లో

## జల వనరుల పరిరక్షణ లక్ష్యం

ముందస్తు చర్యలతో ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొందాం

ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

మెదక్, సంగారెడ్డి జిల్లాల ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై మంత్రి సమీక్ష




**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** ఎల్-నినో ప్రభావం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి,మెదక్ ..మిగతా 2లో




## ప్రకృతి విపత్తులను

# పసిగట్టాలి

ప్రణాళిక యుక్తంగా వ్యవహరించాలి

సమన్వయంతోనే సక్సెస్

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణకు నాంది కావాలని, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రభుత్వ యంత్రాంగం మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజల ప్రయోజనాల పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ..మిగతా 2లో

## రూ.72 లక్షలతో

# పల్లెల ప్రగతి

భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు

దుగ్గొండి మండలంలో పలు అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట, అక్షిత ప్రతినిధి:** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో దుగ్గొండి మండలంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి, పల్లెల్లో మౌలిక వసతులు మెరుగు పరచడమే లక్ష్యంగా రూ.72 లక్షల వ్యయంతో పలు భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు, భూమి పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా మండలంలోని రేకంపల్లి గ్రామంలో గ్రామ పాలన కోసం రూ.20 లక్షలతో ..మిగతా 2లో

## రూ.72 లక్షలతో పల్లెల ప్రగతి

**మొదటి పేజీ తరువాయి...**

కొత్త పంచాయతీ భవనానికి, మహిళల కోసం రూ.10 లక్షలతో సంఘ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే తిమ్మంపేట గ్రామంలో మహిళా సంఘాల బలోపేతం కోసం రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న విలేజ్ ఆర్గానిజేషన్ భవనానికి భూమిపూజ చేశారు. గుడ్డేలుగులపల్లిలో రూ.20 లక్షలతో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, గుడి మహేశ్వరంలో మహిళల కోసం రూ.10 లక్షలతో మరో కొత్త భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇక వెంకటాపురంలో చిన్నారుల కోసం రూ.12 లక్షలతో నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందిస్తున్న ప్రజాపాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నామన్నారు. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధానాధ్యేయమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రజలకు, చిన్నారులకు అన్ని సేవలు ఒకే చోట అందేలా చేయడానికే ప్రభుత్వ భవనాల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జల వనరుల పరిరక్షణ లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

జిల్లాలలో ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు, జిల్లాల వారీ అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్-నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అని, దీని ప్రభావాన్ని అర్థం చేసుకొని నష్టాన్ని వీలైనంత తగ్గించే దిశగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. లోటు వర్షపాతం, నీటి కొరత, పంటలపై ప్రతికూల ప్రభావం వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ లేదా ఎనిమిది ఎకరాల కంది పంట సాగు చేయవచ్చని పేర్కొన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు వీడియో రీల్స్, నాటక ప్రదర్శనలు, కళాజాతాలు, అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపాత పరిస్థితులు, పంటల సాగు, భూగర్భ జలాల స్థితి, జలవనరులలో నీటి లభ్యత, విద్యుత్, తాగు నీటి సరఫరా, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, మెదక్, సంగారెడ్డి జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఆత్మ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి

**మొదటి పేజీ తరువాయి...**

సహకార మార్కెటింగ్ చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి గోద్రెజ్ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ సిపి సునీల్ దత్ వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఫ్యాక్టరీలోని ఉత్పత్తి విభాగాలు ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి చిరునామాగా నిలిచిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు హెవీ వాటర్ ప్లాంట్ థర్మల్ పవర్ స్టేషన్ నవభారత్ వంటి పరిశ్రమలు ఉండేవని జిల్లా పునర్విభజన తర్వాత ప్రస్తుతం ఖమ్మం జిల్లా ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడుతోందన్నారు. పాలేరు జలాశయం నాగార్జునసాగర్ ఎడమ కాలువ, వైరా రిజర్వాయర్ ఈ ప్రాంత రైతాంగానికి జీవనాధారమని పేర్కొన్నారు.రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగు వైపు మళ్లడం అవసరమన్నారు. ఈ అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సమగ్రంగా వివరించారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు నాలుగు సంవత్సరాల కాలంలో ఎకరాకు సుమారు రూ. 52 వేల వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తోందని తెలిపారు. సూపర్ ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఆయిల్ పామ్ సాగు నిలకడైన దిగుబడిని అందిస్తుందని చెప్పారు.

దేశంలో వంటనూనెల అవసరం ఎక్కువగా ఉన్నదని దేశీయ ఉత్పత్తి 12 మిలియన్ టన్నులకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 3 మిలియన్ టన్నుల వంటనూనె దిగుమతుల కోసం రూ.1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు.



ఈ పరిస్థితిని మార్చేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని స్పష్టం చేశారు.

1991-92లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సుమారు 15 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని దేశ అవసరాలకు అనుగుణంగా దానిని 70 లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. 2023లో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.12 వేలుగా ఉండగా ప్రస్తుతం సుమారు రూ.23 వేలకు చేరడం రైతులకు ప్రయోజనకరంగా మారిందన్నారు. వంట నూనెతో పాటు సౌందర్య సాధనాల పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను కూడా ఆయిల్ పామ్ ద్వారా అందించవచ్చని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఈ సమీకృత పరిశ్రమ ఏర్పాటవడం రైతులకు, యువతకు వరంగా నిలుస్తుందని పేర్కొంటూ ఈ పరిశ్రమ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం కృషి చేశారని ప్రత్యేకంగా అభినందించారు. గోద్రెజ్ యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అధికారులు అందరికీ అభినందనలు తెలిపారు. ఈ పరిశ్రమకు అవసరమైన రహదారి మౌళిక సదుపాయాలను టీజీఐఐసీ ద్వారా త్వరలోనే కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో మరిన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పడి రైతులు పండించే పంటలకు స్థానికంగానే విలువ ఆధారిత ఉత్పత్తులు తయారయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. దీని వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ సమీకృత ప్రాజెక్టులో సీడ్ గార్డెన్ మిల్లింగ్ యూనిట్ రిఫైనరీ వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు కావడం విశేషమన్నారు. భవిష్యత్తులో ఆయిల్ పామ్ విత్తనాల కోసం ఇండోనేషియా మలేషియా వంటి దేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. 113 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సమీకృత పరిశ్రమ గంటకు 60 నుంచి 120 టన్నుల గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. గోద్రెజ్ సంస్థ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, మిర్చి, పత్తి, వరి ఆధారిత పరిశ్రమలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని సంస్థను కోరారు. రైతులు వాణిజ్య పంటలు, విలువ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి సుమారు రూ.17 లక్షల కోట్లు ఉండగా వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని సూచిస్తోందన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే వాణిజ్య పంటలు, విలువ ఆధారిత పరిశ్రమలే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. ఇటీవల తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయం జమ చేశామని తెలిపారు.

గోద్రెజ్ సంస్థ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫ్యాక్టరీలో ఉద్యోగాల భర్తీలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంత యువత ప్రతిభావంతులు నైపుణ్యం కలిగిన వారని వారికి ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సర్పంచ్ లు గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు ప్రజాప్రతినిధులు అధికారులు ఆయిల్ పామ్ రైతులు పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తులను పసిగట్టాలి

**మొదటి పేజీ తరువాయి...**

స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తులను ముందుగానే అంచనా వేసి, వాటి ప్రభావాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేసి తెలంగాణకు మార్గదర్శకంగా నిలవాలని పిలుపు నిచ్చారు.

ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేయాలని సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. ప్రజా ప్రతినిధుల సూచనలను గౌరవిస్తూ, క్షేత్రస్థాయిలో రైతులకు ధైర్యం, భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై, ఇతర అభివృద్ధి కార్యకలాపాలపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ...ఎల్‌నినో ప్రభావాన్ని ప్రజలపై పడనీయొద్దని, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్, పశుసంవర్ధకం సహా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జూలై 31 నాటికి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని శాఖలు యుద్ధ యుద్ధప్రాతిపదికన పనులు చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు యుద్ధప్రాతిపదికన పనిచేయాలని స్పష్టం చేశారు.రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ కలెక్టరేటులో సోమవారం నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎల్‌నినో కంటింజెన్సీ సమీక్ష సమావేశంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల పరిస్థితులను శాఖల వారీగా మంత్రి సమీక్షించారు. సమావేశంలో ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ఎల్‌నినో ఎక్స్‌పర్ట్ కమిటీ చైర్మన్ జి. చిన్నారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ షఫీ ఉల్లా, ఉమ్మడి జిల్లా శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి(మహబూబ్ నగర్),జి మధుసూధన్ రెడ్డి(దేవరకద్ర), జె అనిరుధ్ రెడ్డి(జడ్చర్ల), కూచుకుళ్ళ రాజేశ్ రెడ్డి(నాగర్ కర్నూల్), తూడి మేఘా రెడ్డి(వనపర్తి), బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి(గద్వాల), కసిరెడ్డి నారాయణ రెడ్డి(కల్వకుర్తి), డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ (అచ్చంపేట) వీర్లపల్లి శంకర్(షాద్ నగర్), విజయుడు(ఆలంపూర్) ఇతర ప్రజాప్రతినిధులు, ఐదు జిల్లాల కలెక్టర్లు ఖుష్బూ గుప్తా(మహబూబ్ నగర్), ఆదర్శ్ సురభి(వనపర్తి), సి హెచ్ ప్రియాంక(నారాయణ పేట), షేక్ రిజ్వాన్ భాషా(గద్వాల), హేమంత్ కేశవ్ పాటిల్(నాగర్ కర్నూల్),రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివ సేనారెడ్డి,రాష్ట్ర గొర్రెలు,మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ సరిత, మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ మేయర్ జి.మమత,ఉమ్మడి జిల్లా మున్సిపల్ చైర్మన్ అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాఖల వారీగా ప్రస్తుత పరిస్థితులను, భవిష్యత్ కార్యాచరణను అధికారులు మంత్రికి వివరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాధారణంగా ఈ సమయానికి నమోదు కావాల్సిన వర్షపాతంతో పోలిస్తే సుమారు 40 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు.

# విద్యార్థులు డ్రగ్స్ కి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకై కళలు కనాలి

### విద్యార్థుల కదలికలపై అధ్యాపకులు నిరంతరం నిఘా ఉంచాలి: సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మాధకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకై కళలు కనాలని , ఆకళల సాధనకై నిత్యం శ్రమించాలని విద్యార్థులకి డిఎస్పీ నాగేంద్రచారి సూచించారు.

ఈసందర్భంగా సోమవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా తంగాళ్ళపల్లి మండలంలోని వ్యవసాయ కళాశాలలో తెలంగాణ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాధకద్రవ్యాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ... యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనకై నిత్యం శ్రమించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధ్యాపకులకు సూచించారు.

ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజ వినాశనానికి దారి తీసే మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలనీ పిలుపునిచ్చారు. జిల్లాలో డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు

ఈకార్యక్రమంలో తెలంగాణ ఈగల్ టీమ్ డిఎస్పీ ఉపేందర్, ఎస్.ఐ ఉపేందర్ చారి, కళాశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం చలో డిల్లీ

### తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా కమిటీ



**వరంగల్, అక్షిత బ్యూరో:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య ఆదేశానుసారం రాష్ట్రంలో ఉన్నటువంటి యూనియన్ సభ్యులందరూ ఈ నెల 27న ఢిల్లీకి తరలి వెళ్లేందుకు వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయకుమార్, ప్రధాన కార్యదర్శి బొట్ల స్వామిదాస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యలు పరిష్కార సాధన కోసం జర్నలిస్టులు ఐక్యంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల పైన జరుగుతున్న దాడులు వృద్ధ జర్నలిస్టులకు పెన్షన్ అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు, రాష్ట్రంలో పూర్తి ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక సమస్యలు పరిష్కారం చేసుకునేందుకు ఈనెల 27న దేశ రాజధాని న్యూఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వివిధ రాష్ట్రాల ( ఐఎఫ్టియు) అనుబంధంగా ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఉవ్వెత్తున ఉద్యమించి హక్కుల సాధనకు బయలుదేరుతున్నారని ఈ సమావేశం కు దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు నేతలు విచ్చేస్తున్న సందర్భంగా అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొనాలని జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయకుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల స్వామిదాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ పాలడుగుల సురేందర్ ఉపాధ్యక్షుడు వెల్ది రాజేందర్ సహాయ కార్యదర్శి రాంపల్లి శ్రీనివాస్ సభ్యులు ఆకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం చేయాలి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులకు మండల ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతల అప్పగింత

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బట్టు కరుణాకర్



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులకు మండల ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు అప్పగించారు..

ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, ప్రతి మండల ఇన్‌చార్జ్ తమకు కేటాయించిన మండలంలో బూత్ స్థాయి వరకు సమన్వయం చేస్తూ, బీఎల్ఏలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. ప్రతి రోజు జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించి, ఎదురయ్యే సమస్యలను వెంటనే జిల్లా కమిటీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

అదేవిధంగా ప్రతి బూత్‌లో అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు చేయడం, తప్పుల సవరణ, చిరునామా మార్పులు, అవసరమైన దరఖాస్తులను సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పార్టీ ప్రతిష్ఠను దృష్టిలో ఉంచుకొని పూర్తి బాధ్యతతో పనిచేసి, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని జిల్లాలో ఆదర్శవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు..

# విద్యార్థి సుశాంత్ కు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించిన ఎమ్మెల్యే



**తాండూరు, అక్షిత ప్రతినిధి:** సుశాంత్ కు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, అండ. గత కొన్ని రోజుల క్రితం బషీరాబాద్ జడ్పీ హెచ్ఎస్ పాఠశాల ఆవరణలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు జరుగు తుండగా విద్యార్థి సుశాంత్ పై చెట్టు కొమ్మ అకస్మాత్తుగా విరిగి తలపై పడి, తలకు గాయమై హైదరాబాద్ లోని ఆలివ్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవలే కోలుకున్న సుమంత్ కు రూ.1,43,200/- విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం క్యాంప్ కార్యా లయంలో అందించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి. గతంలో చికిత్స ఖర్చుల నిమిత్తం వ్యక్తిగతంగా రూ.20,000/- వేల ఆర్థిక సహాయం విద్యార్థి కుటుంబ సభ్యులకు అందించారు. సహకారం అందించడం పట్ల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ తదితరులు ఉన్నారు.

# "మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు" ఆవిష్కరణ




**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రాసిన కథల సంకలనం " మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు" పుస్తకాన్ని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఆవిష్కరించారు. సోమవారం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో గల ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి లో జరిగిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో విద్యార్థులు చక్కటి కథలు రాయడం నిజంగా అభినందించదగ్గ విషయమన్నారు. విద్యార్థుల్లో అభ్యసనాభివృద్ధికి, పఠనాసక్తిని పెంపొందించడానికి ఈ కథలు ఉపయోగపడుతాయన్నారు. ఈ కథలను తీసుకురావడానికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ బృందాన్ని ఆయన అభినందించారు. పాలమూరు ఎన్.ఆర్.ఐ.ఫోరమ్ ఆర్థిక సహకారంతో పుస్తకాన్ని వెలువరించడం పట్ల ఆయన ఎన్.ఆర్.ఐ ఫోరాన్ని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి.ఇ.ఆర్.టి డైరెక్టర్ రమేష్, ఆర్జేడీ సోమిరెడ్డి, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ బృందం, జిల్లా ఎ.ఎం.ఓ దుంకుడు శ్రీనివాస్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ప్రశాంత్, జిల్లా ఎస్.ఎస్.ఎ.బృందం తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**గుడిపల్లి, అక్షిత ప్రతినిధి:** గుడిపల్లి మండలం చిలకమర్రి గ్రామంలో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ దూదిపాల అశ్విని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతే గ్రామాభివృద్ధికి పునాది. మహిళా సంఘ భవనం ద్వారా మహిళలకు శిక్షణ, సమావేశాలు, స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలి. భవన నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తాం అని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీడీఓ డి.ఎం. అబ్దుల్ అజీమ్ గ్రామపంచాయతీలోని వన నర్సరీ, డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. పరిశుభ్రత, హరితహారం పనులపై సర్పంచ్‌కు, గ్రామపంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీవో నవీన్, పంచాయతీరాజ్ ఏఈ చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ మాధవరెడ్డి, ఏపీఎం నాగలీల, సీసీ అంజయ్య, వీవోఏ సరిత, వార్డు సభ్యులు నాగేశ్వరావు, కాలియానాయక్, మహిళా సంఘ సభ్యులు మరియు గ్రామ ప్రముఖులు బాలకృష్ణ, దామోదర్ రెడ్డి, రాములు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి అండగా సీఎంఆర్ఎఫ్

**లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**కౌన్సిలర్ జూపల్లి అన్వర్**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని 7వ,8వవార్డులో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన లబ్ధిదారులు ఆలీబాబా 25,000/ మహేరునిసా బేగం 17,500/ చెన్నమ్మ 30,000/ సాధిక 30,000/వేలను ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను సోమవారం మున్సిపల్ కౌన్సిలర్ జూపల్లి అన్వర్, మాజీ వార్డు మెంబర్ బరిగెల వేణు గోపాల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అరిఫుద్దీన్, టౌన్ యూత్ ప్రెసిడెంట్ ఆజాం బాబా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. చికిత్స ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ

**జిల్లా కలెక్టర్ హెమంత కేశవ్ పాటీల్**

**అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు కావాలి, ఆగస్టు 3లోగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలని సూచన**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హెమంత కేశవ్ పాటీల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిని పరిశీలించిన ఆయన, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ......, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి ఓటరికి ఈ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించాలని, ఆగస్టు 3వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని వారి వివరాలు ఓటర్ల జాబితాలో నమోదు కాకపోవచ్చనే విషయాన్ని ప్రతి ఓటరికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.

అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా నమోదు ప్రక్రియకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు డిజిటలైజేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అదేవిధంగా, అనర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగకుండా చూడడంతో పాటు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటరు నమోదు (డూప్లికేట్ నమోదు) జరగకుండా అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేలా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు.

జిల్లా కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్చన, బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో, బీఎల్‌వోలు, డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న అధికారులు తదితరులు ఉన్నారు.

## కల్లూరు విజ్ఞాన్ స్కూల్లో పేరెంట్స్ మీటింగ్

**పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, ఎఎంసి చైర్మన్, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్**

**అధికారులు , విద్యార్థుల తల్లిదండ్రులు**





**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** కల్లూరు స్థానిక విజ్ఞాన్ స్కూల్ నందు స్ఫూర్తి ఫౌండేషన్ తల్లి తండ్రులు ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, ఎఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, స్థానిక అంబేద్కర్ నగర్ జిల్లా అధికారులు జినుగు మరియన్న జిల్లా హార్టికల్చర్ అధికారి మాహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా డిపిఆర్ ఓ శీలం శ్రీనివాసరావు, విజ్ఞాన్ స్కూల్ కరెస్పాండంట్ షేక్ ఇస్మాయిల్, కల్లూరు మున్సిపాలిటీ 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, రిటైర్డ్ లెక్చరర్ ఉబ్బన నాగరాజు, స్ఫూర్తి ఫౌండేషన్ లబ్ధిదారులు తల్లిదండ్రులు, విద్యార్థులు స్ఫూర్తి కమిటీ సభ్యులు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, చింతలపూడి కృష్ణ, ఉబ్బన వేణుబాబు, షేక్ ముజీమ్,మర్రెల వెంకటేశ్వరావు, ఇందూరి దేవేందర్, దామల దయాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరి శ్రీవ్యాల్ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు ప్రస్తుతం వారి యొక్క పిల్లలను పెద్ద పెద్ద చదువులు చదివించడానికి కష్టాన్ని కూడా లెక్కచేయకుండా ఆస్తుల కంటే పిల్లల చదువులే ముఖ్యం అని భావించిన తల్లిదండ్రులు వారి జీవితాన్ని కొవ్వొత్తి లాగా కరిగిపోతూ త్యాగం చేస్తున్నారు కనుక ఎన్ని జన్మలెత్తినా వారి ఋణం తీర్చుకోలేము, కనుక వారి కష్టాన్ని వమ్ము చేయకుండా దీపం వెలుగు కారు చీకట్లను తొలగించే వెలుగుగా మారాలని, మంచి ఉద్యోగాల్లో సెటిల్ అయ్యి మీ తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని విద్యార్థులకు తెలుపుతూ ఇదే మా స్ఫూర్తి ఫౌండేషన్ కు ఇచ్చే పెద్ద రిటర్న్ గిఫ్ట్ అని శ్రీవ్యాల్ తెలియచేసారు. అంతేకాకుండా రానున్న కాలంలో మన తెలుగు రాష్ట్రాల్లో ఎన్జీవో వారి యొక్క అవసరం లేకుండా సొంతంగా చదివించుకునే పరిస్థితులు, అభివృద్ధి చెందాలని ఎన్జీవోల అవసరం లేకుండా ఉండాలని కోరుకుంటున్నాను అని తెలుపుతూ, సభకు హాజరైన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా తైక్వాండో బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

**వనపర్తి తైక్వాండో అసోసియేషన్ క్రీడాకారుల అద్భుత ప్రతిభ**




**వనపర్తి అక్షిత ప్రతినిధి:** హైదరాబాద్‌లోని కాప్రాలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 19, 2026 ఆదివారం రోజున నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో వనపర్తి జిల్లాకు చెందిన క్రీడాకారులు తమ అద్భుత ప్రతిభతో సత్తా చాటారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కిషోర్ కుమార్ ల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ పరీక్షలు అత్యంత క్రమశిక్షణతో జరిగాయి. ఈ గ్రేడింగ్ టెస్ట్‌లో 'వనపర్తి తైక్వాండో అసోసియేషన్' క్రీడాకారులు కఠినమైన పరీక్షలను ఎదుర్కొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. అసోసియేషన్‌కు చెందిన ప్రముఖ తైక్వాండో కోచ్‌లు శివ శంకర్, రవిలు తమ అద్భుత ప్రతిభతో ప్రతిష్టాత్మక 'డాన్ 3' బ్లాక్ బెల్ట్ కైవసం చేసుకున్నారు. వీరితో పాటు వనపర్తి తైక్వాండో అసోసియేషన్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులందరూ 'డాన్ 1' బ్లాక్ బెల్ట్ సాధించి రికార్డు సృష్టించారు. కొత్తకోట మరియు కొత్తకోట మండలానికి చెందిన విద్యార్థులు పి. మాధవ్, మోహన్, నిఖిల్, బి. గౌతమ్ సాయి గౌడ్, బి. హర్షిల్ దీప్ గౌడ్, పాలెం గ్రామానికి చెందిన కె.టి. వైశాలిలతో పాటు.. అగ్రహారం గ్రామానికి చెందిన క్రీడాకారులు భాను తేజ, అరుణ్, జస్వంత్, అఖిల్, కార్తీక్‌లు ఈ 'డాన్ 1' బ్లాక్ బెల్ట్ సాధించిన వారిలో ఉన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి బ్లాక్ బెల్ట్ సాధించిన వనపర్తి జిల్లా కోచ్ లను, విద్యార్థులను వనపర్తి తైక్వాండో అసోసియేషన్ సీనియర్ మాస్టర్లు పెంటన్న యాదవ్, నరేంద్ర సాగర్, శ్రీను యాదవ్ నరేష్ నాయుడు, రమేష్ రెడ్డి, పరుశురాం శివయ్య, సురేష్, యాదగిరిలు ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి వనపర్తి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# యూఏఈలో ఘనంగా బోనాలు

## ఏమి రేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు

## ముఖ్య అతిథిగా కొత్త జైపాల్ రెడ్డి




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** విదేశాలలో కూడా బోనాలు, బతుకమ్మ వంటి సంప్రదాయ పండుగలు ఘనంగా నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు పరిచయం చేయడం అభినందనీయమని మైత్రి గ్రూప్స్ వ్యవస్థాపకుడు కొత్త జైపాల్ రెడ్డి అన్నారు.

దుబాయ్ లో ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విదేశీ గడ్డపై తెలంగాణ ఆత్మను సజీవంగా నిలుపుతున్న ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు.

యూఏఈలోని రాస్ అల్ ఖైమా మైత్రి ఫార్మ్స్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దుబాయ్, అబుదాబి,షార్జాతో పాటు వివిధ ఎమిరేట్స్‌ల నుంచి సుమారు 400 మంది తెలంగాణ ప్రవాస భారతీయులు కుటుంబాల సమేతంగా హాజరై భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో వరుసగా నాలుగోసారి నిర్వహించిన ఈ వేడుకలో గౌరమ్మ పూజ, బోనాల సమర్పణ, కుంకుమార్చన, మహాహారతి, దీపోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పట్టు చీరలు ధరించిన మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ నిర్వహించిన ఊరేగింపు, ఒగ్గు డోలు మోతలు, పోతురాజుల విన్యాసాలు తెలంగాణ సంస్కృతిని విదేశీ నేలపై ఆవిష్కరించాయి.

ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ కుమార్ పీచర, అధ్యక్షుడు జగదీష్ రావు మాట్లాడుతూ, విదేశాల్లో జన్మించిన భావితరాలకు తెలంగాణ పండుగల గొప్పతనాన్ని పరిచయం చేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం భక్తులందరికీ ప్రసాదం పంపిణీ చేసి, తెలంగాణ సంప్రదాయ వంటకాలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విదేశాల్లో ఉన్నామనే భావన కలగకుండా స్వగ్రామంలో బోనాలు జరుపుకున్న అనుభూతిని ఈ కార్యక్రమం కల్పించిందని తెలంగాణ ప్రవాసులు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ఎలిగేటి, ప్రధాన కార్యదర్శి రాణి కొట్ల, సంయుక్త కార్యదర్శి శేఖర్ గౌడ్ గుండవేని, కోశాధికారి తిరుమల్ రావు బీరెల్లి, మాజీ అధ్యక్షులు రాధారపు సత్యం, సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్ రావు, ఎస్.పీ. కస్తూరి, సురేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వినోద్ ఆచారి, రఘు ఎలిగేటి, రాము కందుకూరి, సామ శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ పోలంపల్లి, కిరణ్ చెట్టిగారి, సారిక పీచర, మమత కస్తూరి, అన్నపూర్ణ, మౌనిక గౌడ్, మధు కుమార్, వనజ గోగుల, రనీషా, విపుల, స్వప్న, దీపిక తదితరులు, మహిళా విభాగ సభ్యులు, వాలంటీర్లు మరియు యూఏఈ నలుమూలల నుంచి వచ్చిన తెలంగాణ ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు వినేదెన్నడు

## కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడం పట్ల కౌన్సిలర్ల ఆగ్రహం

## వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి

## బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్ రెడ్డి

**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** భూపాలపల్లి మున్సిపాలిటీలో నూతన పాలక వర్గం కొలువు తీరిన తర్వాత ఇప్పటివరకు కేవలం ఒకే ఒక్క కౌన్సిల్ సమావేశం మాత్రమే నిర్వహించారని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 29వ వార్డు కౌన్సిలర్ గండ్ర హరీష్ రెడ్డి విమర్శించారు.







భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు..పాలక వర్గం కొలువు తీరిన తర్వాత నిర్వహించిన సమావేశం కూడా ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు కాకుండా, పాలకపక్షం తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు తూతూమంత్రంగా నిర్వహించారని ఆరోపించారు.మున్సిపాలిటీలో పాలకపక్షానికి చెందిన కౌన్సిలర్లకే ఐదు నెలలు గడిచినా నిధులు ఎక్కడ,ఎలా ఖర్చు చేస్తున్నారనే విషయంపై స్పష్టత లేదన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పట్టణంలో డ్రైనేజీ సమస్యలు,పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, పారిశుధ్య లోపాలు వంటి అనేక సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు.

ఈ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు రూపొందించేందుకు కౌన్సిల్ సమావేశం నిర్వహించేలా ఎలాంటి కార్యాచరణ కనిపించడం లేదని గండ్ర హరీష్ రెడ్డి విమర్శించారు.ప్రజా సమస్యల పరిష్కారమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యంగా ఉండాలని, వెంటనే కౌన్సిల్ సమావేశం నిర్వహించి పెండింగ్ సమస్యలపై చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు జ్యోతుల మంజుల, మోతె రాజు, భోగం నరేందర్, తదితరులు పాల్గొన్నారు..

# ఖాసీంపేటలో ఘనంగా బేతెస్థ మినిస్ట్రీస్ 19 వ వార్షికోత్సవం

## మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం హెప్సిబా ప్రభాకర్

## ఆశీర్వదించిన కేరళ పాస్టర్ డా.అబ్రాహాశీ,జార్జ్ వెన్మాని




**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** సూర్యాపేట మున్సిపల్ పరిధి 4వ వార్డు ఖాసీంపేటలోని బేతెస్థ మినిస్ట్రీస్ 19 వ వార్షికోత్సవాన్ని బిషప్ దుర్గం ప్రభాకర్ కరుణ శ్రీ ( హెప్సిబా )ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులు కేరళకు చెందిన పాస్టర్ డా.అబ్రాహాశీ జార్జి వెన్మాని పాల్గొని దేవుని వాక్యాన్ని బోదించగా నల్లగొండకి చెందిన పాస్టర్ వై.యేసురత్నం తర్జుమా చేశారు. అనంతరం పాస్టర్ వెయ్యి మంది భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్స్ కు శాలువా మెమోంటో తో సత్కరించారు. అనంతరం బిషప్ దుర్గం హెప్సిబా ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నో శ్రమల మధ్యలో అన్నో అద్భుతాలు చేసి ఆ దేవుడు,ఈ 19 ఏళ్ళు మనల్ని కాపాడినందుకు యేసుక్రీస్తుకి కృతజ్ఞతలు చెప్పారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షులు బిషప్ గడ్డం డేవిడ్ రాజు, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు రెవ.డా జలగం జేమ్స్,రెవ.ఏర్పుల క్రీస్థోఫర్, పాస్టర్ యం.రూబెన్,టి.కిరణ్ బాబు,పాస్టర్ కొండేటి లాజర్,యం. క్రీస్థోఫర్,పాతకోటి దేవదానం,స్థల దాతలు పాస్టర్ సిరపంగి జార్జి,సిరపంగి ప్రకాశం బోనగిరి స్టిఫెన్,కొమ్ము హోసన్నా తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలి

## ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎండి.అమీర్

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణ కేంద్రంలో నిరసన




**తొర్రూర్ అక్షిత ప్రతినిధి:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి ఐతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి. అమీర్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణ కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సెంటర్లో వారు నిరసన వ్యక్తం చేశారు అనంతరం వారు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వల్ల దాదాపు 21 మంది విద్యార్థులు ఆత్మహత్య లు చేసుకున్నారని కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.. 2014 నుండి 2026 వరకు 142 పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు సరిగ్గా పరీక్షలు నిర్వహించడం చేతకాని కేంద్ర ప్రభుత్వం, విద్యార్థులను అనచి వేస్తుందని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ నిర్వహించే ఎన్ టి ఏ సంస్థ ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేసారు.. అలాగే నేడు ఢిల్లీలో జరిగిన చలో పార్లమెంటులో విద్యార్థులపై దాడి చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.. తక్షణమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్,ప్రభు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



## ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా పంట మార్పిడిపై రైతులకు విస్తృత అవగాహన


**ఏఈఓ స్పందన**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా పంట మార్పిడిపై రైతులకు ఏఈఓ స్పందన విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా గ్రామ సర్పంచ్ శిరీష సాయి, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఈవో స్పందన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కనిపించే అవకాశం ఉన్నందున వర్షాధార పై ఆధారపడే రైతులు అధికంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడవచ్చని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి పంటల మార్పిడి పై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాధార సాగుపై ఆధారపడే రైతులకు నష్టాలు కలగకుండా పంటల మార్పిడిపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు. రైతులు కేవలం వరి సాగుకే పరిమితం కాకుండా, వారి భూభాగం, నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి ఉద్యాన పంటలు, కూరగాయలు, ఉల్లిపాయ, మినుములు, కందులు, వేరుశెనగ తదితర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని కోరారు. పంటల పై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. లాభదాయకమైన పంటల సాగు వైపు మళ్లించేలా ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయం లభించే అవకాశాలను వివరించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును కాపాడుకోవాలి

**ఎస్.ఐ.ఆర్ నమోదు ప్రక్రియలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు**



**వరంగల్, అక్షిత బ్యూరో:** 13 డివిజన్ ఎల్,బీ నగర్ లో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం కొనసాగుతున్న తీరును కాంగ్రెస్ నేతలు పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యం వ్యవస్థ లో ఓటు హక్కు ఎంతో విలువైనది. దీనిని కాపాడుకోవడం ప్రతిఒక్కరి భాద్యత. భారత ఎన్నికల సంఘశీ ప్రవేశపెట్టిన "ప్రతేక ఓటరు సమగ్ర సవరణ" కార్యక్రమంలో అందరూ పాల్గొని తమ ఓటు కోల్పోకుండా ఏనుమరేషన్ ఫారాలు వ్రాసి ఇవ్వాలని. కొత్తగా ఓటు హక్కు పొందేవారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, పేర్లు మార్చుకోనుటకు, చిరునామా మార్చుకొనుటకు, తప్పులు సవరించుకొనుటకు అవకాశం ఉందని. డివిజన్ లోని ప్రతిఒక్క కాంగ్రెస్ బూత్ ఏజెంట్లు నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గోపాల నవీన్ రాజు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్,మాజీ కార్పొరేటర్ సురేష్ జోషి, 13 డివిజన్ పోలింగ్ బూత్స ఇంచార్జి జన్ను అనిల్ కుమార్, సామల భాస్కర్, కుమ్మరి పూర్ణ, ఎజాజ్, జన్ను నూతన్ బాబు బి.ఎల్.ఓ లు, బి ,ఎల్,ఏలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హత కలిగిన ఓటును కాపాడటమే లక్ష్యం

**ప్రతి ఇంటికి చేరుకోవాలి.. బిఎల్ఎలు గడప గడప ప్రచారం నిర్వహించాలి...**

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం..**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, మాజీ కార్పొరేటర్లు, సర్ బూత్ ఇన్‌చార్జ్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, సర్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాసీర్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

సమావేశంలో గత నెల రోజులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సార్ ప్రక్రియలో డివిజన్, బూత్‌ల వారీగా జరిగిన పురోగతిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమగ్రంగా సమీక్షించారు. ప్రతి డివిజన్‌లో ఇప్పటివరకు జరిగిన పని, ఎదురవుతున్న సమస్యలు, బూత్‌ల వారీగా నమోదవుతున్న పురోగతిపై నాయకులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి గడప గడప ప్రచారం నిర్వహించాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా



కాపాడడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం, తప్పులు ఉండడం, చిరునామా మార్పులు, ఇతర సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన దరఖాస్తులు పూర్తి చేయించాలని సూచించారు.

డివిజన్ స్థాయిలో పార్టీ సంస్థాగత బలోపేతానికి త్వరలోనే డివిజన్ అధ్యక్షుల నియామకాలు చేపడతామని ఎమ్మెల్యే ప్రకటించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు, బాధ్యతలు తప్పకుండా లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఇ వి శ్రీనివాస్ రావు,పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కేంద్రంలోని బీజేపీ నియంతృత్వ పాలన కొనసాగుతుంది

**సిపిఐ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.**




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తూ, దేశ రాజధాని ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీపై తీవ్ర ఆందోళన జరుగుతుంటే ప్రధాని మోడీ ఒక నియంతలా వ్యవహరిస్తూ కళ్ళుండి చూడలేని కబోధిలా దుర్మార్గంగా పరిపాలిస్తున్నాడని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. సోమవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యులు పిట్టల సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ పరిపాలన కొనసాగిస్తున్నాడని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారి సంక్షేమానికి కొమ్ముకాస్తున్నాడని, విచ్చలవిడిగా దేశ సంపదను, వనరులను కొల్లగొడుతున్నాడని,పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం వారిని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసే విధంగా బీజేపీ ప్రభుత్వం అధికారం చెలాయిస్తుందని,అత్యంత అవినీతి పరులకు,అక్రమార్కులకు అండగా నిలవడమే కాకుండా వారిని బీజేపీ అక్కున చేర్చుకోవడం హేయమైన చర్య అని అన్నారు. పన్నెండేళ్ళ పరిపాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని,నల్ల డబ్బు తేలేదని, 2కోట్ల ఉద్యగాల మాటలు నీటిమూటలయ్యాయని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్,నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారం వేస్తుందని, వికసిత్ భారత్ పేరుతో ప్రజల దృష్టిని మారుస్తుందని, గ్రామీణ ప్రజల బ్రతుకులకు వరప్రసాదం లాంటి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి గార్చేందుకే మహాత్మా గాంధీ పేరు తొలగించిందని,రాష్ట్రాలపై భారం వేసిందని ఇలా అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీ విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్ట్ నెలలో పాదయాత్రలు నిర్వహిస్తామని, సెప్టెంబర్ లో ఛలో డిల్లీకి పిలుపునిచ్చినట్లు చాడ వెంకటరెడ్డి తెలిపారు.దేశంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ నీట్ పేపర్ లీక్ అయినా దోషులను శిక్షించలేదని,కనీసం నైతిక బాధ్యత వహించి కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని,లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని,బాధ్యులను శిక్షించాలని దిల్లీలో ఆందోళన జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటుందని, ఆందోళన కారులపై లాఠీచార్జీ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని దీనిని సీపీఐ ఖండిస్తుందని, విద్యార్థులతో,నిరుద్యోగులతో చెలగాటం ఆడితే ప్రభుత్వం కుప్పకూలక తప్పదని వెంకటరెడ్డి హెచ్చరించారు.ఈ సమావేశములో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, టేకుమల్ల సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి,న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూల స్తంభం

**ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్యం పై దాడి**

**2029 ఎన్నికలే లక్ష్యంగా ఎస్ఐఆర్ ప్రయోగం...**

**రాజకీయా ప్రయోజనాల కోసమే సర్ ప్రయోగం...**

**సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు**






**చౌటుప్పల్ / అక్షిత న్యూస్ :** ప్రజాస్వామ్య పరిరక్షణకు అప్రమత్తత అవసరమని, ఓటు హక్కు ఏ ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదని, ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ ను ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియగా కాకుండా, రాబోయే ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వినియోగించుకుంటోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు ఆరోపించారు .

అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాల్సిన ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించే రాజకీయ ప్రయత్నాల కోసం సర్ నీ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ముఖ్య వక్తగా రాఘవులు పాల్గొని ఎస్ఐఆర్‌పై విస్తృతంగా మాట్లాడారు...

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ రాజ్యాంగబద్ధమైన ప్రక్రియేనని, అయితే గతంలో జరిగినప్పుడు ఇంత తీవ్ర రాజకీయ చర్చలు, ప్రజల్లో ఆందోళనలు కనిపించలేదని రాఘవులు అన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో చివరిసారిగా 2002లో సమగ్ర సవరణ జరిగిందని, పదేళ్లకోసారి జరగాల్సిన ప్రక్రియ ఆలస్యంగా ఇప్పుడు చేపట్టడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రతి ఏడాది కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఎన్నికల సమయంలో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహించడం ఎన్నికల సంఘం సాధారణ విధానమే అయినప్పటికీ, ఈసారి ఎస్ఐఆర్‌పై అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తం కావడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోందన్నారు.

**రాజకీయ ప్రయోజనాల కోసమే...**

ప్రస్తుతం చేపడుతున్న ప్రక్రియ వెనుక ప్రజాస్వామ్య పరిరక్షణ కంటే 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ లాభం పొందాలనే ఉద్దేశం ఉందని ఆయన ఆరోపించారు.

దేశంలో ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, నిరుద్యోగం, యువతలో అసంతృప్తి వంటి కారణాల తో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతోందని పేర్కొంటూ, ఎన్నికల్లో ప్రజాభిప్రాయంతో గెలవడం కష్టమవుతుందనే అంచనాతోనే ఓటర్ల జాబితాలను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

గత ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసిన వర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి ఓటు హక్కును లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.

అత్యల్ప మెజారిటీతో బీజేపీ ఓడిపోయిన నియోజకవర్గాలను గుర్తించి,అక్కడ ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్లను తగ్గించడం ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే వ్యూహం అన్నారు.గతంలో బీహార్, బెంగాల్,అస్సాం రాష్ట్రాలలో అమలు చేసి వాళ్ళు గెలిచారని ప్రస్తుతం తెలంగాణలో కూడా అమలు చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**డీలిమిటేషన్ రాజకీయ ఎత్తుగడ**

నియోజకవర్గాల పునర్విభజన డీలిమిటేషన్ ప్రక్రియను కూడా ఎన్నికల లబ్ధికి అనుకూలంగా వినియోగించే ప్రయత్నం జరుగుతోందని రాఘవులు ఆరోపించారు. బీజేపీకి అనుకూల ప్రాంతాలను ఒకే నియోజకవర్గంగా మార్చడం, ప్రతిపక్షాలకు బలం ఉన్న ప్రాంతాలను విభజించడం ద్వారా ఎన్నికల సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.

జిల్లాలో బిఎల్‌ఓ, బి.ఎల్. ఎ లుగా విధులు నిర్వహిస్తున్న వారికి సరైన శిక్షణను ఇవ్వలేదని జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని పరిశీలించి అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని అన్నారు.వలస కార్మికులు గ్రామాలలో లేరని నేటికి అనేక వేల మంది దరఖాస్తు పారాలను పూర్తి చేసి ఇవ్వలేదని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం డి పాషా, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య ,కొండమడుగు నరసింహ ,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజ్ గౌడ్, కల్లూరి మల్లేశం ,బూరుగు కృష్ణారెడ్డి, జల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసచారి,మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు రాయగిరి కిష్టయ్య, సిరిపంగి స్వామి ,అవ్వారు రామేశ్వరి, బొడ్డుపల్లి వెంకటేష్ ,మద్దెల రాజయ్య, దూడ యాదిరెడ్డి ,కోట రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డి.జానకి

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు**





**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి ప్రజల నుంచి వచ్చిన వినతులను నేరుగా స్వీకరించి, వారి సమస్యలను విని పరిశీలించారు.

ఈ సందర్భంగా అర్జీదారులు తెలిపిన సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి, ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, పోలీసు స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి వినతులను బాధ్యతతో స్వీకరించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు.

## ప్రజావాణికి 14 ఫిర్యాదులు

**డిఎఓ శ్రీనివాస్ శర్మ**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో డిఎఓ జె. శ్రీనివాస్ శర్మ అధ్యక్షతన సోమవారం జరిగిన డివిజన్ స్థాయి ప్రజావాణికి అత్యధిక ఫిర్యాదులు సుమారు 14 వచ్చాయి. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి సోమవారం జరిగిన ప్రజావాణిలో మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయంకు 2, మిర్యాలగూడ మున్సిపాలిటీకి 2, మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంకు 1, మాడ్గులపల్లి తహసీల్దార్ కార్యాలయంకు 1, త్రిపురారం తహసీల్దార్ ఒకటి, జిల్లా పంచాయతీ అధికారికి ఒక దరఖాస్తు వచ్చాయి. ప్రజావాణిలో మిర్యాలగూడ ఎంపిడిఓ ఎం. శేషగిరిశర్మ, మండల వ్యవసాయాధికారి ఎం.ఋష్యేంద్రమణి, నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎండి. అహ్మదుల్లా, బిక్షం, జనార్ధన్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇఇ మణిదీప్, ఉపాధి హామీ పథకం ఎపిడి బాలకృష్ణ, ఎక్సైజ్ ఎస్ఐ షేక్ పర్వీన్, విద్యుత్ ఎఇ నవీన్, ఎపిఎం దిలీప్ కుమార్, హెచ్డబ్ల్యూఓ జానిమియాలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను తనిఖీ చేసిన కమీషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో కొనసాగుతున్న " సర్ " ప్రక్రియలో భాగంగా సోమవారం కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ పలు డివిజన్లలో పర్యటించారు. నగరంలోని క్రిస్టియన్ కాలనీతో పాటు జ్యోతినగర్ ప్రాంతాల్లో తనిఖీ చేసి పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ తీరు పై బూత్ లెవెల్ అధికారులు, సూపర్ వైజర్, మానిటరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, ఆన్ లైన్ వివరాల నమోదు, తదితర విషయాల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితాను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, ఆన్ లైన్ పోర్టల్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. నగర ప్రజలు ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్ఓ లకు సహకరించాలన్నారు. పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను వెను వెంటనే బిఎల్ఓలకు తిరిగి అందించి ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రమణారెడ్డి, బిఎల్ఓ లు, సూపర్ వైజర్లు, మానిటరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## జువ్వి నర్సింహ్మాకు ఘన సన్మానం



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మండలం,ధర్మోజి గూడెం గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మాను గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పాల ఉత్పత్తిదారుల సంఘం తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ గా సేవలు అందించిన జువ్వి నర్సింహ్మా సర్పంచ్ గా గెలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గా రెండోసారి ఎన్నికైన రాచకొండ కృష్ణయ్యను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ లు సామిడి అంజిరెడ్డి, సామిడి లింగారెడ్డి, ఊదరి ఎల్లయ్య, కొంతం సుశీలఎల్లారెడ్డి, జంగం అంజయ్య, బద్రి బుచ్చయ్య, జక్కలి మల్లయ్య, కార్యదర్శి చెరుకు మహేందర్ గౌడ్, రాచకొండ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**175 దరఖాస్తుల రాక**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో :** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా ప్రజావాణి మొత్తం 175 దరఖాస్తులు



వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు.

**డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాల్లోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కి 6, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో 4 ప్రజావాణికి దరఖాస్తులు వచ్చాయి.

ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అభినందనలు



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** మార్షల్ ఆర్ట్స్‌లో విశేష ప్రతిభ కనబర్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారి మాల్వే విహాన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విహాన్ తన తల్లిదండ్రులు రామేశ్వర్, అశ్విన్‌తో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్న వయస్సులోనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించి సంగారెడ్డి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని ఎమ్మెల్యే కొనియాడారు. భవిష్యత్తులోనూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, వసంత్ రెడ్డి తదితరులు పాల్గొని చిన్నారిని అభినందించారు.

## ఘనంగా రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణోత్సవ కార్యక్రమం




**భద్రాచలం అక్షిత న్యూస్:** రోటరీ క్లబ్ 39 వ నూతన అధ్యక్షుడిగా షేక్ అజీమ్ మరియు కార్యదర్శి గా శ్రీనాథ్ రాజేష్ కోశాధికారిగా రామకృష్ణ తో ఇన్స్టాలేషన్ ఆఫీసర్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శివనారాయణ ప్రమాణం చేయంచటం జరిగింది. ఈ కార్యక్రమంకి ముఖ్య అతిథిగా ఐ టి సి యూనిట్ హెడ్ శైలేందర్ సింగ్ విశిష్ట అతిథిగా పాకాల దుర్గాప్రసాద్ మరియు నూతన సభ్యుల తో ప్రమాణ స్వీకారోత్సవ ఆఫీసర్ గా అసిస్టెంట్ గవర్నర్ వెంకటరెడ్డి వ్యహరించటం జరిగింది. నూతన అధ్యక్షుడు షేక్ అజీమ్ మాట్లాడుతూ ఈ సంవత్సరశీ జిల్లా గవర్నర్ సహకారంతో పేర్మినెంట్ ప్రాజెక్ట్స్ చేస్తాను అని చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ అధ్యక్షురాలు వరలక్ష్మి,మాజీ కార్యదర్శి బాల కృష్ణ మహేంద్ర,హరి ప్రసన్న కుమార్,ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవికుమార్, ప్రోగ్రామ్ చైర్మన్ పాస్ట్ ప్రెసిడెంట్ ప్రభాకర్ గుప్తా,యశోద రాంబాబు, వీరయ్య,అజయ్ కుమార్,నాగేశ్వర రావు,మునికేసావ రావు,శ్రీ మహాలక్ష్మి, వసంతరావు,మధు,చైతన్య,డా.సోమయ్య మరియు సభ్యులు చలపతి,సాగర్,శ్రీనివాసరావు,మోహన కృష్ణ గ్లాడ్ స్టోన్,నరసింహారావు,శ్రీధర్ రెడ్డి,వంద వాసు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కేంద్రంలో ముమ్మరంగా ఓటర్ల జాబితా సర్వే: పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు ఎల్లోజు నరేష్



**తిరుమలగిరి,అక్షిత ప్రతినిధి :** తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే కార్యక్రమం ముమ్మరంగా సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎల్లోజు నరేష్ స్థానిక 312వ పోలింగ్ బూత్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఆయన బూత్ లెవెల్ ఆఫీసర్ తో కలిసి అర్హులైన ఓటర్ల ఇళ్లను స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్లోజు నరేష్ ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాలను సేకరించారు. కొత్తగా ఓటు హక్కుకు అర్హులైన యువతీ యువకుల సమాచారంతో పాటు, మార్పులు చేర్పులు ఉన్న వారి వివరాలను ఎన్యుమరేషన్ ఫారాలలో స్వయంగా నమోదు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు, ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని వివరాలను అందజేశారు.

## ఘనంగా లయన్స్ క్లబ్ వినాయక ప్రమాణ స్వీకార మహోత్సవం



**తొర్రూర్ అక్షిత ప్రతినిధి:** లయన్స్ క్లబ్ తొర్రూర్ వినాయక ఫ్రెండ్స్ 4వ ప్రమాణస్వీకార మహోత్సవం మాజీ అధ్యక్షుడు లయన్ తల్లాడి హిరదర్ అధ్యక్షన ఘనంగా జరిగింది. నూతన అధ్యక్షుడు గా లయన్ వనం మోహన్, ప్రధాన కార్యదర్శి లయన్ పారిపల్లి శ్రావణ్ కుమార్, కోశాధికారి గా దొడ్డ లింగయ్య లను ప్రమాణ స్వీకారం చేసారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వినాయక క్లబ్ సేవలు చాలా అద్భుతంగా నిర్వహిస్తున్నారు అని, క్లబ్ ని ఫ్యామిలీ క్లబ్ చేసి మహిళలు కూడా సేవ కార్యక్రమంలో పాల్గొనడం గర్వించదగ్గ విషయం అని అన్నారు.వినాయక క్లబ్ మరెన్నో సేవ కార్యక్రమలు నిర్వహించి జిల్లా స్థాయిలో అవార్డు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి ఉప జిల్లా గవర్నర్ లయన్ హరికిషన్ రెడ్డి, మాజీ గవర్నర్లు లయన్ డా. రాజేందర్ రెడ్డి,లయన్ తమ్మేర లక్ష్మీ నరసింహారావు, క్యాబినెట్ సెక్రటరీ లయన్ పాము శ్రీనివాస్, జిల్లా జి.ఎస్.టి కోర్డినేటర్ లయన్ వెంకట్ రెడ్డి, జిల్లా జి ఈ టి కోర్డినేటర్ లయన్ శారదా, ఏరియా లీడర్ లయన్ రేవూరి వెంకన్న, రిజియన్ చైర్మన్ లయన్ డా.నాగవాని,జోన్ చైర్మన్ ఈ. శ్రీనివాస్, లయన్ డా. కిరణ్ కుమార్,లయన్ విశ్వేశ్వర్ రావు, లయన్ వీరభద్రరావు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మరియు చార్టెడ్ ప్రెసిడెంట్ లయన్ సోమశేఖర్, ఫస్ట్ ప్రెసిడెంట్ లయన్ యాదగిరి, ఉపాధ్యక్షులు లయన్ బుదారపు శ్రీనివాస, లయన్ రాగి శ్రీనివాస చారీ, లయన్ బుధరపు పద్మ, జాయింట్ సెక్రటరీ లయన్ సులోచన, సహాయ కోశాధికారి లయన్ పద్మం అనురాధ,క్లబ్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ పుప్పాల రవీందర్, కొండ్ల ఉమేష్, బీజ్జల సోమయ్య,ఏ. మురళి, ఏ.వెంకట మల్లయ్య క్లబ్ చైర్ పర్సన్స్ లయన్ చిట్యాల శంకర్, రేవూరి శ్రీనివాస, శ్రీధర్, ధనలక్ష్మి, ఆడెపు స్వామి, హరిప్రసాద్, బైరి సతీష్, రామచంద్రయ్య,రాణి క్లబ్ సభ్యులు, వివిధ లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆసుపత్రి సందర్శించిన వరంగల్ సిపి



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, సోమవారం వరంగల్ గాంధీ హాస్పటల్ ను సందర్శించారు. సోమవారం యం.జి. యంకు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ అవుట్ పోస్ట్ సందర్శించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, ఇక్కడికి వచ్చే మెడికో లీగల్ కేసులకు సంబంధించి ఏవిధమైన చర్యలు చేపడుతున్నారు. వీటికి సంబందించి వివరాలను నమోదు చేసే రికార్డులను పరిశీలించారు.

అనంతరం పోలీస్ కమిషనర్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతకు చికిత్స అందిస్తున్న డి అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను సాధరణ స్థితికి తీసుకవచ్చేందు.. వైద్యులు అందిస్తున్న చికిత్స విధానాన్ని వైద్యులు పోలీస్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా యం.జి.యం పరిసరాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ హాస్పటల్ కు సంబందించి ప్రధాన మార్గంతో పాటు, వాహన పార్కింగ్ ప్రదేశాలు,ముఖ్యమైన స్థలాల్లో సిసి కెమెరాల ఏర్పాటుపై సంబందించిన అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు, యం.జి.యం లో పార్కింగ్ ఏర్పాట్లు, హాస్పిటల్ సంబందించి ప్రధాన మార్గం నుండి హాస్పటల్ కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాస్పటల్ ప్రధాన ద్వారంలో ఆటోలను నిలపకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిపి ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత,యం.జి.యం సూపరింటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్.యం. ఓ, ఏసీపీలు జితేందర్ రెడ్డి, సదయ్య, సత్యనారాయణ,ప్రశాంత్ రెడ్డి ఇన్స్ స్పెక్టర్లు కరుణాకర్, రాఘవేందర్ తో పాటు ఆర్.ఎస్.ఐలు పూర్ణ చందర్ రెడ్డి, మనోజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.